## క్లుప్తంగా

### అల్లూరి జయంతోత్సవాలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కంతేటి వెంకటరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో ఈనెల 2, 3, 4 తేదీల్లో శ్రీవిజ్ఞానవేదిక, అల్లూరి సీతా రామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతా రామరాజు జయంతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి తెలిపారు. మంగళవారం భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, మందిర కార్యదర్శి కుక్కల బాల, జనపాటి మధు సుధన్ రావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

### ఆక్రమిత భూమి పరిశీలన



ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలించిన భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ఆకివీడు: ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూమిని మంగళవారం భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ సరిహద్దులో ఉన్న 4.75 సెంట్ల ప్రభుత్వ భూమిని 22ఏ రికార్డుల నుండి తొలగించాలని గ్రామానికి చెందిన బండారు సత్యనారాయణ, సూర్యనారాయణలు చేసుకున్న దరఖాస్తు ఆధారంగా ఆ భూమిని ఆర్డీఓ పరిశీలించారురు. ప్రస్తుతం దీనిలో చేపల చెరువు సాగు చేస్తున్నారని తహసీల్దార్ వెంకటేశ్వరరావు వివరించారు. ఆర్డీఓ నివేదిక అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలన చేపడతారని తహసీల్దార్ వివరించారు. ఆర్డీఓ వెంట ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్ ఉన్నారు.

### రమణరాజుకు సత్కారం



భీమవరంలో నేత్రవైద్యుడు రమణరాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: డాక్టర్స్ డే సందర్భంగా భీమవరం పట్టణంలో మూడు దశాబ్దాలకుపైగా ప్రముఖ నేత్ర వైద్యుడిగా, దివ్యాంగులకు ఉచిత విద్యనందిస్తున్న డాక్టర్ యువీ రమణరాజును విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, అరసవల్లి ఈశ్వరమ్మ చారిటబుల్ అధ్యక్షుడు రమణరాజు ఏర్పాటు చేసిన బ్లైండ్ సెంటర్‌లో విద్యనభ్యసించిన అనేక మంది పేద దివ్యాంగులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా మరికొంతమంది సొంతగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ ఖాసిం, రిటైర్డ్ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, మోటేపల్లి రామకృష్ణ, ఇందుకూరి శివాజీవర్మ తదితరులు పాల్గొన్నారు.

### రేపు వెంకటావధాని జయంతి

ఉండి: తిరుపతి కవుల్లోఒకరైన దివాకర్ల వెంకటావధాని 113వ జయంతి వేడుకలు గురువారం ఉండి మండలం యండగండిలో నిర్వహిస్తున్నట్లు దివాకర్ల సాహితీ సంస్థ అధ్యక్షుడు చెరుకువాడ అప్పల రామకృష్ణవర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దివాకర్ల పేరుతో ప్రతిఏటా అందించే దివాకర్ల సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది సహస్రవధాని బ్రహ్మశ్రీ కోట వెంకట లక్ష్మీ నరసింహకు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు హాజరవుతారని పేర్కొన్నారు.

### గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కామర్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ డిగ్రీ కలిగి 55 శాతం లేదా ఆపైన మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 9 లోపు కళాశాల ఆఫీసులో దరఖాస్తులు అందజేయాలని వివరించారు. జూలై 9న ఉదయం 10 గంటలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

# మాయమవుతున్న పుంతలు

- రైతులు, మట్టి మాఫియా చేతుల్లో ఆక్రమణలు, తవ్వకాలు.
- పట్టించుకోని అధికారులు

ఉండి: వ్యవసాయ, రైతు అవసరాల కోసం సుదూర ప్రాంతాల్లోని పొలాల వద్దకు చేరుకునేందుకు, పొలాలు, గ్రామాల మధ్య ఉండేవే ప్రభుత్వ పుంత భూములు. ఈ పుంత భూముల్లోనే రోడ్లు వేసి గ్రామాల మధ్య కనెక్టవిటీ, రైతులు పొలాలకు వెళ్లేందుకు అనువుగా పుంతరోడ్లు వేయడంతో వ్యవసాయ అభివృద్ధి జరుగుతుంది. అలాగే వరికుప్ప నూర్పుల కోసం,వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కోసం వినియోగించే ఈ ప్రభుత్వ భూములు (పుంతలు)రాను రాను బక్కచిక్కిపోతున్నాయి. సమీప ప్రాంత రైతులు పుంతలను నెమ్మది నెమ్మదిగా తమ పొల్లాల్లో కలిపేసుకోవడంతో అవికాస్త తరిగిపోతున్నాయి. ఎవరి పొలం వద్ద వుండే పుంత భూమిని సదురు రైతు ఆక్రమించుకుని కొద్దికొద్దిగా చేనులో కలిపేసుకుంటున్నాడు. గట్టు లంకలు, మెరక తీసే పని చేసిన ప్రతిసారీ, దుక్కుదున్నిన సమయంలోను పుంతలు కరిగిపోతున్నాయి.

**పెరుగుతున్న తవ్వకాలు**

రైతులను మించి పుంతలను మట్టి అక్రమ రవాణాదారులు ఆక్రమించుకుంటున్నారు. పుంతలను ఇష్టానుసారంగా వాడుకుంటున్నారు. ముఖ్యంగా రైతుల కోసం ఏర్పాటు చేసిన పుంత రహదారులను మట్టి అక్రమ రవాణాదారులు ధ్వంసం చేస్తున్నారు. భారీ వాహనాలతో రాజకీయ పలుకుబడితో మట్టి రవాణా చేస్తున్నారు. ఏ ప్రాంతంలో అయితే పుంత భూములు ఎక్కువగా ఉన్నాయో ఆ ప్రాంతాన్ని మట్టి అక్రమ రవాణాదారులు ఎంచుకుని అక్కడి నుంచి పుంతల మట్టిని కూడా తరలించేస్తున్నారు. పుంతలను తవ్వేయడంతో పాటు వారి ఇష్టానుసారం రహదారుల కోసం పుంతను విడగొట్టేస్తున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పుంత భూములను ధ్వంసం చేయడంతో పాటు మట్టిని అక్రమంగా తరలించేశారు. పుంత భూములు అన్యాక్రాంతం అవుతున్నా గ్రామ రెవెన్యూ అధికారులు గానీ మండలాధికారులు గానీ అటువైపు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. దానికి కారణాలు అనేకం ఉన్నాయి. గ్రామ పరిధిలో పుంత భూములను తవ్వేస్తుంటే సదరు గ్రామ రెవెన్యూ అధికారికి తెలియకుండా ఉంటుందా? అలాగే కళ్లెదుటే పుంత భూముల్లోని మట్టిని అక్రమంగా తవ్వుకుపోతుంటే అధికారులకు సమాచారం ఉండదా?అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మండలస్థాయి అధికారులు ప్రభుత్వ పుంత భూములను రక్షించాలని లేకుంటే భవిష్యత్‌లో పొలాలకు వెళ్లేందుకు దారులు కూడా కనుమరుగవుతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కలిసిపూడితో భారీగా మట్టి తవ్వేసిన పుంతలు

### పుంత భూములను పరిరక్షించాలి



అధికారుల కళ్లెదుటే ఇదంతా జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. రైతులు వరిచేలల్లో మట్టిని తరలిస్తుంటేనే ఆరా తీసే అధికారులు ప్రభుత్వ భూములు తవ్వేస్తుంటే తెలియకుండాతుంటుందా? మిగిలిన భూములనైనా కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. లేకపోతే రైతుల మధ్య గొవలు తప్పవు.

– బదుగు బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు

### వ్యవసాయ అభివృద్ధి కోసమే పుంత భూములు



వ్యవసాయాభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, ఎరువులు పొలాలకు చేరవేసేందుకు మినహాయింపు చేసుకున్నవే పుంత భూములు, వాటిని ఎప్పటికే జాగ్రత్తగా కాపాడుకోవాలి. అవి హరించుకుపోయినా, కనుమరుగైపోయినా రైతుల మధ్య కొట్లాటలు, అధికారులకు తలనొప్పులు తప్పవు.

– శేషాద్రి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు

### పెయ్య దూడల అభివృద్ధికి కృషి

పెనుగొండ: పాడి రైతుల అభివృద్ధికి పశువుల్లో కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా పెయ్య దూడల ఉత్పత్తికి పశు సంవర్ధక శాఖ కృషి చేస్తుందని తాడేపల్లిగూడెం డివిజన్ డెప్యూటీ డైరక్టర్ డాక్టర్ ఎల్‌కే సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ రూ. 500 ఉన్న వీర్య నాలికను రూ.150కే అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ సంపర్కం చేసినపుడు 95 శాతం కేవలం పెయ్యదూడలే జన్మిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 6న ప్రపంచ అంటు వ్యాధుల నివారణ దినోత్సవం నిర్వహిస్తామని, పెంపుడు కుక్కలకు అన్ని పశువైద్య శాలల్లో ఉచితంగా యాంటి రాబీస్ టీకాలు వేస్తామని తెలిపారు.

### మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్.చిక్కాల గ్రామానికి చెందిన ఎం.పద్మ అనే మహిళ జూన్ 27న బయటకు వెళ్లి వస్తానని చెప్పి మళ్లీ తిరిగి రాలేదని అన్నారు. ఆమె కోసం బంధువులు ఇళ్ల వద్ద గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త నరసింహరావు మంగళవారం రూరల్ పోలీసులను ఆశ్రయించాడు.

# లంక రోడ్లు ప్రమాదకరం



అధ్వానంగా ఉన్న లంక రోడ్డుపైకి వచ్చిన పాము



భారీ గోతులతో ప్రమాదకరంగా ఉన్న లంక రోడ్డు

కాళ్ల: లంక రోడ్డులో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడి పోతున్నారు. మండల కేంద్రమైన కాళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని లంక రోడ్డు భారీ గోతులతో అధ్వానంగా మారింది. దీనికి తోడు వర్షాకాలం కావడంతో గోతుల్లో వర్షపు నీరు నిలబడి ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారింది. లంక రోడ్డును ఆనుకుని జగనన్న కాలనీ ఉంది. 120 మందికి స్థలాలు కేటాయించిన ఈ కాలనీలో ప్రస్తుతం సుమారు 35 కుటుంబాలు నివసిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక పనిపై ఈ కాలనీ నుంచి మెయిన్ రోడ్డు మీద వరకు రావాలంటే సుమారు ఒకటిన్నర కిలోమీటర్లు దూరం ప్రయాణించాలి. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిపోవడంతో పాటు రహదారి అధ్వానంగా ఉండటం, దీనికి తోడు రాత్రి పగలు అని తేడా లేకుండా రోడ్ల మీదకు విషసర్పాలు సంచరించడంతో ఆదారిలో ప్రయాణం అంటేనే కాలనీవాసులు భయపడుతున్నారు. నిత్యం వందలాది మంది రైతులతో పాటు, ప్రజలు నడిచే ఈరహదారిపై అధికారులు దృష్టి సారించి ప్రజలు కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### లారీ బ్యాటరీలు మాయమయ్యాయని ఫిర్యాదు

భీమవరం: లారీల బ్యాటరీలు మాయమయ్యాయని వీరవాసరం గ్రామానికి చెందిన కంచర్ల శ్రీరామ్‌కుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ పోలీసులు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరామ్‌కుమార్‌కు చెందిన మూడు లారీలను భీమవరం పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని పేటేటి వెంకటనాగేశ్వరరావు లారీట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు వద్ద పార్కింగ్ చేసి వాటి ఆరు బ్యాటరీలను అక్కడే రేకులషెడ్‌లో గత నెల 14వ తేదిన భద్రపర్చివెళ్లగా మరుసటి రోజు కన్పించలేదు. ఆ బ్యాటరీల విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని జూన్ 30వ తేదిన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: భీమవరం పట్టణం శివరావుపేటకు చెందిన వ్యక్తి కన్పించడం లేదంటు అతని తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఏఎస్ఐ ఎస్ వెంకట్రావు చెప్పారు. శివరావుపేటకు చెందిన దండు విజయకుమార్ జూన్ 30వ తేదిన చెరువుల వద్ద పనికి వెళుతున్నట్లు ఇంటిలో చెప్పి వెళ్లాడు. మంగళవారం వరకు విజయకుమార్ తిరిగి రాకపోవడంతో అతడి తల్లి విమల ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెంకట్రావు చెప్పారు.

### ప్రైవేట్ హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి



భీమవరంలో డీఎస్పీ జయసూర్యకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

భీమవరం: భీమవరం పట్టణంలోని ప్రైవేట్ బాయ్స్ హాస్టల్స్‌లో ఆడపిల్లలకు కూడా వసతి కల్పించడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) భీమవరం విభాగ్ కన్వీనర్ కాయిత డిన్ను చందు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని విష్ణు కళాశాల సౌత్ గేట్ దగ్గరలోఉన్న ప్రవేటు హాస్టల్‌లో పురుషులు, మహిళలకు కలిసి ఒకే హాస్టల్ నిర్వహించడాన్ని నిరసిస్తూ హాస్టల్ వద్ద ఆందోళన నిర్వహించి అనంతరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్యకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాయి వెంకటదుర్గా సాయి, నగర కార్యదర్శి జగదీష్, జిల్లా టెక్నికల్ సెల్ కన్వీనర్ గొర్లి మణికంఠ, సాయి కృష్ణ, సన్నీ, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

### సీనియర్ సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గ ఎన్నిక



భీమవరం సీనియర్ సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గం దృశ్యం

భీమవరం: పట్టణంలోని సీనియర్ సిటిజన్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో జరిగిన మహాజనసభలో వ్యవస్థాపక అధ్యక్షుడిగా మెంటే సోమేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా మేళం దుర్గా ప్రసాద్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు, బోనం పాండురంగారావు, సహాధ్యక్షుడిగా మట్లపూడి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా దాయన చంద్రజీ, పులఖండం కోటేశ్వరరావు, చీమకుర్తి నర్సింహారావు, దిరిసాల సత్యనారాయణమూర్తి, పెన్మత్స రామకృష్ణంరాజు, సయ్యద్ బాజీ ఎన్నికయ్యారు. నిర్వహణ కార్యదర్శిగా తాళ్ళపూడి గాంధీ, కోశాధికారిగా కర్రెడ్డి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిలుగా బండారు సోమన్న, సిహెచ్ ఆర్‌వివి నాయుడు,పెన్మెత్స భాస్కరపెద్దిరాజు, నల్లం రఘుబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మూడేళ్లపాటు అధికారంలో ఉంటుందని అధ్యక్షుడు వెంకటకృష్ణ నాగేశ్వరరావు చెప్పారు.

# స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలి



భీమవరంలో సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేత గోపాలన్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యదర్శివర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పెట్టాలనుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించి కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని శరవేగంగా అమలు చేయడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ మీటర్ల వలన ప్రజలపై తీవ్రమైన భారాలు పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు నష్టం చేకూర్చే ఇలాంటి స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని తక్షణ ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలందరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రప్రభుత్వం రైల్వే చార్జీలు పెంపు అన్యాయమని బలరాం అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన రైల్వే చార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌విగోపాలన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కొత్త పెన్షన్ల మంజూరు అమలు చేయకపోవడం విఫలమైందని దుయ్యబట్టారు. రైతులకు నేటికీ ధాన్యం బకాయిలు సుమారు రూ. 293 కోట్లు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, బి వాసుదేవరావు, చింతకాయలు బాబురావు, కర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రజక సభను జయప్రదం చేయండి



రజక సభను విజయవంతం చేయాలని కోరుతున్న ఉప్పలూరి చంద్రశేఖర్

భీమవరం (ప్రకాశంచౌక్): తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జూలై 6 తేదీన నిర్వహించనున్న రజక ఆకాంక్ష సభను జయప్రదం చేయాలని ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పలూరి చంద్రశేఖర్ కోరారు.భీమవరం పట్టణం పేరంటాల చెరువు ఆదిలక్ష్మి రజక సంఘ భవనంలో నిర్వహించిన పట్టణ రజక నాయకుల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజమండ్రి నగర రజక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రజక ఆకాంక్ష సభకు ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్పర్సన్ సి.సావిత్రి సభాధ్యక్షురాలిగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ రాష్ట్ర మంత్రివర్యులు కందుల దుర్గేష్ పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురుందేశ్వరి, పాక వెంకట సత్యనారాయణ రాజమండ్రి పార్లమెంటులోని శాసనసభ్యులు శాసనమండి సభ్యులు ప్రభుత్వ నామినేటెడ్ చైర్మన్ డైరెక్టర్లు, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు రజక మేధావులు విజ్ఞానవంతులు, ఉద్యోగస్తులు వివిధ రజక సంఘాల నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఆల్ ఇండియా ధోబి మహాసంగ్ ఉపాధ్యక్షులు చింతాడ శ్రీనివాస్ మాట్లాడుతూ జూలై 6వ తేదీన రాజమండ్రిలో నిర్వహించనున్న రజక ఆకాంక్ష సభకు పశ్చిమగోదావరి జిల్లా నుండి రజకసంఘ నాయకులు రజక సోదరీ సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.ఈసమావేశంలో ఆల్ ఇండియా ధోబి మహా సంఘం మీడియా కోఆర్డినేటర్ అమనాపు వెంకటేశ్వరరావు ఆదిత్య బాబి రజక సంఘాల నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు దొమ్మేటి సుబ్బయ్య వజ్జిపర్తి గురుమూర్తి గంటి నాగేంద్ర నేదునూరి గంగాధర్ తిలక్ చించినాడ ప్రసాద్ గరగపర్తి మల్లేశ్వరరావు కంబాల జగదీష్ జామి రమేష్ చించినాడ శ్రీనివాస్ తలుపూరి కష్ట తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా వైద్యుల దినోత్సవం



కాళ్ల: వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైద్య సిబ్బంది



ఆకివీడు: విద్యార్థులకు నగదు సాయం చేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

ఉండి: అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. మంగళవారం ఉండి పీహెచ్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సాయిచంద్ర,డాక్టర్ సునందలను క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గాదిరాజు రంగరాజు, క్లబ్ కోశాధికారి పెన్మత్స వెంకట జగన్నాథరాజు, కార్యదర్శి పెన్మత్స రంగప్రసాద్‌రాజు, సత్తి బ్రహ్మరెడ్డి, రుద్రరాజు నరసరాజు తదిదతరులు పాల్గొన్నారు.

**కాళ్లలో..**

కాళ్ల: ఉద్యోగంలా కాకుండా ప్రజలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైద్యులు చిన్నమిల్లి రంగం నాయుడు, సరాబు సునీల్ తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమం మంగళవారం కాళ్ల ప్రభుత్వాసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పూల బొకేలతో వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే వైద్య సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు**

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు తమ తెలివి తేటలతో మరిన్ని ఉన్నత చదువులు చదవాలని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. స్థానిక ఐఎంఏలో డాక్టర్స్ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన నలుగురు విద్యార్థులకు రూ. 10 వేలు చొప్పున ఐఎంఏ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ కె.మహేష్ వర్మ, ఎండీ బిలాల్, కవిత, పీబీ, ప్రతాప్ కుమార్, మాధవి పాల్గొన్నారు.

### కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

భీమవరం: భీమవరంలో మంగళవారం సీపీఐ భీమవరం పట్టణ 25వ మహాసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాస్తూ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు చేపట్టిన దేశ వ్యాప్త కార్మిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఆగష్టు 6, 7 తేదీల్లో ఉండిలో సీపీఐ 27వ జిల్లా మహాసభలు జరగనున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకిచ్చిన ఇళ్ల స్థలాలు హామీతో పాటు సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాలని కోనాల డిమాండ్ చేశారు. తొలుత సీపీఐ పతాకాన్ని సీపీఐ సీనియర్ నాయకుడు పోతుల యాకోబు ఆవిష్కరించారు.

● **నూతన కమిటీ ఎన్నిక.....**

సీపీఐ భీమవరం పట్టణ కార్యదర్శిగా చెల్లబోయిన రంగారావు, జాయింట్ సెక్రటరీగా మల్లుల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా వైవిఆనంద్, కిలారి మల్లేశ్వరరావు, పోతుల యాకోబు, పాలా త్రిమూర్తులు, నీలాపు శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసభలో కలిశెట్టి వెంకట్రావు, నెక్కంటి సుబ్బారావు, సికిలే పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

### దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలి



సమ్మె పత్రాలు అందజేస్తున్న దృశ్యం

వీరవాసరం: లేబర్ కోడ్‌లు తెచ్చి ఉద్యోగ కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు అందరూ సహకరించాలని సీపీఎం నాయకులు సమ్మె పత్రాలను ఆవిష్కరించారు. మంగళవారం సీఐటీయూ, రైతు, కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముత్తూట్ ఫైనాన్స్, చాంబర్ ఆఫ్ కామర్స్, ఆటో, భవన నిర్మాణ కార్మిక సంఘాలకు సమ్మె పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి ఉద్యోగులు కార్మికులు దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తోందని వాటి స్థానంలో లేబర్ కోడ్లు తీసుకువస్తుందని అన్నారు. వీటివల్ల ఉద్యోగ కార్మికులు అనేక తరగతుల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లనే జాతీయ కార్మిక సంఘాలు అన్నీ కలిసి ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె చేయాలని నిర్ణయించాయని సమ్మెలో అన్ని సంస్థలు సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొత్తల సత్తిబాబు, రైతు సంఘం నాయకులు బొర్రా అలమహారాజు, బాలం విజయకుమార్, చేతి వృత్తిదారుల సంఘం నాయకులు యండమూరి సుబ్బారావు, ఆటో కార్మిక సంఘం నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.